క్లుప్తంగా

మినీ గోకులం షెడ్డు ప్రారంభం

పి.గన్నవరం: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ముంగండలో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఏపీఓ లక్ష్మీనారాయణ, నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల జేడీ, తోలేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని సంబరం

అంబాజీపేట: కె.పెదపూడిలో తిరుమనాథం కొండ ఆధ్వర్యంలో వీరభద్రుని సంబరాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వీరభద్రుని ప్రతిమలతో గ్రామోత్సవం నిర్వహించారు. శరభ.. అశ్శరభ శరభ అంటూ వీరభద్రుని ఊరేగించారు. అనంతరం అన్నసమారాధన చేపట్టారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



బడుగువానిలంకలో అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్‌ట్యాంకుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మినీ గోకులాలను ప్రారంభించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా రావులపాలెం నుంచి హైదరాబాద్ నాన్ స్టాప్ సర్వీస్‌గా ఏర్పాటు చేసిన రెండు సూపర్ లగ్జరీ బస్సులను శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జీజీవీ రమణ, అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ ధర్నా

సఖినేటిపల్లి: ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, బీకేఎంయూ నాయకులు ధర్నా చేశారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలు ఇచ్చిన దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, కౌలు రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, నాయకులు గెడ్డం ప్రభాకర్‌రావు, దీపాటి గంగాచలం, దొండపాటి చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం



పెదపట్నంలో సప్తాహానికి కలశ స్థాపన చేస్తున్న యువరాజు దంపతులు

మామిడికుదురు: పెదపట్నంలోని పురాతన ఉమా మూలేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ వార్ల ఆలయాల ప్రాంగణంలో 20వ సప్తాహం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. తోరం యువరాజు, సూర్యకుమారి దంపతుల ఉత్సవాలకు కలశస్థాపన చేశారు. ఈ నెల 17వ తేదీ వరకు సప్తాహం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సప్తాహంలో భాగంగా పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఈ నెల 17 వరకు నిరంతరాయంగా శ్రీరామనామ సర్వనామ కీర్తలతో భజన నిర్వహిస్తారు. పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు సప్తాహంలో పాల్గొని ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల వద్ద ఏకాహం జరుగుతోంది.

వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో జల్‌జీవన్ మిషన్‌లో రూ.1.32 కోట్లతో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఈ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని ఇవ్వాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకంలో గ్రామంలో ఇప్పటికే పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే నేదునూరులో గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో మొత్తం 8 గోకులం షెడ్లను నిర్మించారన్నారు. కార్యక్రమంలో అధికారులు, నేతలు ఉన్నారు.

కమనీయం.. ముక్కోటి పర్వదినం



ఎల్.గన్నవరంలో ఉత్తర ద్వార దర్శనమిచ్చిన వేంకటేశ్వరుని సన్నిధిలో భక్తులు



రావులపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- ఉత్తరద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం అశేష భక్త కోటి జనం అత్యంత భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని జరుపుకొన్నారు. దీంతో అన్ని గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో అంతటా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన ఆలమూరు మండలంలోని చింతలూరులో వేంచేసిన ఉత్తర ముఖద్వార శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలోని దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తబృందంతో ఏర్పాటు చేసిన గీతా పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ, భూ సమేత వేంకటేశ్వస్వామిని పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు అందరిని మంత్రముగ్ధులను చేసింది. అలాగే మండలంలోని సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లో నెలకొన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తులు పోటెత్తడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. ఆయా గ్రామాల్లో వైష్ణవాలయాల ప్రధాన అర్చకులందరూ దేవతామూర్తుల విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగింపు జరిపారు. అల్లంరాజు రామకృష్ణమూర్తి, ద్విభాష్యం కాశీ విశ్వనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక పూజల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల్లో తెల్లవారుజామున ఉత్తర ద్వార భక్తులకు ప్రవేశం కల్పించారు. పుల్లేటికుర్రు వేంకటేశ్వర స్వామి ఆలయం, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, నందంపూడి, తొండవరం వాకలగరువు, చిరతపూడి, ఇసుకపూడి, కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, ముక్కామల, మొసలపల్లి, పసుపల్లి, కముజువారిలంక, మాచవరం గ్రామాల్లో ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండలంలోని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు వేంకటేశ్వర స్వామి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్.గన్నవరంలో వేంచేసిన బీబీనాంచారీ అలమేలు మంగా సహిత వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే పోతవరంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని ఉత్తర ద్వారంలో భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: ఉత్తర ద్వార దర్శనం సర్వపాపహరమని అంతర్జాతీయ కృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ తెలిపారు. నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. అయినవిల్లి సీతారామచంద్రస్వామివారి ఆలయంలో లక్ష చామంతి పూజ జరిపారు. నల్లచెరువు వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



అంబాజీపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి



చింతలూరులో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

రావులపాలెంలో..

రావులపాలెం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం మండలంలోని వివిధ ఆంజనేయ స్వామి ఆలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొమ్మలు చెప్పే చక్కని సంస్కృతి

కొత్తపేట: దేశమంతా సంక్రాంతి సంబరాలు జరుపుకొంటున్న నేపథ్యంలో కొత్తపేట ప్రియదర్శినీ బాలవిహార్‌లో భారతీయ వైభవాన్నీ, తెలుగు సంస్కృతిని మేళవిస్తూ ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మన దేశంలో వివిధ గ్రామాలలో శతాబ్దాల క్రితం జీవం పోసుకుని ఇప్పటికీ దేశ విదేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందుతున్న హస్తకళాకృతుల విశిష్టతను పిల్లలకు తెలియజెప్పాలనే సత్సంకల్పంతో తమ స్కూల్‌లో గత 49 ఏళ్లుగా రెండు, మూడేళ్లకు ఒకసారి బొమ్మలకొలువు ఏర్పాటు చేస్తున్నామని ప్రియదర్శినీ బాలవిహార్ కరస్పాండెంట్ అద్దంకి బుద్ధచంద్రదేవ్ అన్నారు. మొదట్లో మూడు మెట్లతో మొదలు పెట్టిన మా బొమ్మల కొలువు ఈ సంవత్సరం 11 మెట్లకు చేర్చగలిగామన్నారు.

ఈ బొమ్మల కొలువులో దేవతా మూర్తులు, పురాణ పురుషులు, యోగులు, సిద్ధులు, బుద్ధులు, మత గురువులు, మత చిహ్నాలు, దేశ ప్రముఖులు, శాస్త్రవేత్తలు, వృత్తులు, శ్రమజీవులు, పక్షులు, జంతువులు, పండ్లు, వాహనాలు, వాద్య పరికరాలు ఉన్నాయి.



కొత్తపేట ప్రియదర్శినీ బాలవిహార్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

తెలుగు సంస్కృతికి నెలవులు బొమ్మల కొలువులు

భారతీయ సంప్రదాయ కళా వైభవ ప్రతీకలు బొమ్మల కొలువులు. మన అపూర్వ ప్రాచీన సత్సంప్రదాయాలను ఆదరపూర్వకంగా ఆచరిస్తూ మనస్సుల్లో అపురూపంగా నిలబెట్టుకుంటూ మన ముందు తరాలకు అందజేద్దాం అనే దృక్పథంతో వ్యయప్రయాసలతో కూడినదైనా కుటుంబ సభ్యుల సహకారంతో దీన్ని ఏర్పాటు చేసినట్టు బుద్ధచంద్రదేవ్ తెలిపారు.

తూర్పుపాలెం అప్రోచ్‌కు భూమి పూజ

మలికిపురం: అసంపూర్తిగా మిగిలిపోయిన తూర్పుపాలెం వంతెన పనులు పునః ప్రారంభం పనులకు శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమి పూజ చేశారు. గ్రామంలోని కూటమి నాయకులలో గొడవల వల్ల కొన్నేళ్లుగా ఈ వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. అసంపూర్తిగా మిగిలిన పనులను ఎమ్మెల్యే దేవ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తగాదాలతో రూ.4.30 కోట్లతో బ్రిడ్జి కట్టి, అప్రోచ్ రోడ్డు పనులు చేయకుండా ఆపేశారన్నారు. కనీసం అప్రోచ్ రోడ్డుకు సర్వే కూడా చేయకుండా వదిలేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా ఇన్ని కోట్లతో కట్టిన వంతెన ప్రజలకు వినియోగంలోకి రాకపోవడంపై ఆయన అసంతృప్తి చెందారు. భూమి ఇచ్చే రైతులను గుర్తించకుండా బ్రిడ్జి మంజూరు చేయడం తగదన్నారు. అప్రోచ్ రోడ్డు కోసం భూమి ఇవ్వడంలో కలహాల వల్ల నిర్మాణం ఆగిపోయిందని, ఇటీవల ఇరువర్గాలను సంప్రదించి, ఈ రోజు పనులు పునః ప్రారంభించానన్నారు. రెండు నెలల్లో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పారు. సర్పంచ్‌లు జి.సత్తిబాబు, వై.నాగు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన పార్టీ నాయకులు





జగన్‌మోహన్‌రెడ్డితో కోటబాబు, రాము

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంబాజీపేటకు చెందిన సొసైటీ మాజీ చైర్మన్ కొర్లపాటి కోటబాబు, సీనియర్ నాయకులు సూదాబత్తుల రాము, అరిగెల శివకల్యాణ్, జల్లి వెంకటేష్ గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారన్నారు. పార్టీ సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారని తెలిపారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ జరిగింది. జిల్లా మలేరియా జోనల్ అధికారి డాక్టర్ ఆశ విచ్చేసి పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించారు. రోగుల వివరాలు, ఔషధ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి రక్త పరీక్షలు అందుతున్న తీరుపై రోగులను ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి డి.సువర్చలాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీహెచ్‌సీ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. దోమల నివారణకు అంటువ్యాధుల వ్యాప్తి నిరోధానికి తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకుని పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎస్‌పీఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, హెచ్ఈ డి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.



చొప్పెల్ల పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా జోనల్ అధికారి ఆశ

నిరుపేదకు సహాయం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కామిశెట్టి ఏడుకొండలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జనసేన గ్రామశాఖ ఆధ్వర్యంలో సేకరించిన రూ.54 వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. మృతుడి భార్య సత్యవతికి ఈ మొత్తాన్ని అందజేశారు. పార్టీ నేతలు తులా బ్రహ్మాజీ, రవణం మణికంఠ ఆధ్వర్యంలో ఈ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా జనసేన నేతలను ఎమ్మెల్యే అభినందించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా లూటుకుర్రు గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రారంభించారు. మొదటి విడతలో రూ.55.77 లక్షలతో నిర్మించే విధంగా 32 మినీ గోకులం షెడ్లను మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు మినీ గోకులం షెడ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, లబ్ధిదారుడు పాలూరి పెద్దిరాజు, విళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని పలువురికి నోటీసులు

అయినవిల్లి: జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ఆదేశాల మేరకు అయినవిల్లిలో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు నిషేధంపై గ్రామంలో పలువురికి నోటీసులు అందజేసినట్లు గ్రామ పంచాయతీ అధికారి కె.రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద పూజాసామగ్రి అమ్మే వ్యాపారులకు, పలు కిరాణా షాపులు, హోటల్ యజమానులకు ఈ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో సచివాలయం ఉద్యోగులతో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లతో పర్యావరణం దెబ్బతింటుందని వారు తెలిపారు. జనవరి 14 నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వాడరాదన్నారు. ఉపయోగిస్తే వారిపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు ఉన్నారు.



వ్యాపారులకు నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది

ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలి



జగ్గన్నతోటలో స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమరాజు

అంబాజీపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల ఉత్సవం, తీర్థాన్ని అందరి సహకారంతో శాంతియుతంగా చేసుకోవాలని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. ప్రభల తీర్థం జరిగే ప్రాంతాన్ని ఎస్సై కె.చిరంజీవితో కలసి శుక్రవారం పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి ప్రభల ఉత్సవాన్ని చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థానికి వచ్చే అల్లరి మూకపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు సంతోషంగా జరుపుకొనేలా సమన్వయంతో అందరూ పనిచేయాలని, పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలన్నారు. ప్రభల తీర్థానికి వచ్చే రహదారుల వెంబడి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన చోట పోలీస్ పికెట్, మొబైల్ పార్టీ ఉంటుందన్నారు. ప్రతి ప్రభకు పోలీసు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందాలు, గుండాలు, పేకాటలు ఆడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా పండగలు చేసుకోవాలన్నారు.

దుస్తుల పంపిణీ

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్యాలయ సిబ్బందికి ఎంపీడీఓ జి.భీమారావు సంక్రాంతి సందర్భంగా తన సొంత ఖర్చులతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ దుస్తులను సిబ్బందికి శుక్రవారం అందజేశారు. ఎంపీడీఓ జి.భీమారావు సంక్రాంతి పండగను మండల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంస్కృతికి సంప్రదాయాలకు పెద్దపీట వేయాలన్నారు.

పశుసంపదతో ఆర్థిక పురోభివృద్ధి

అంబాజీపేట: పశు సంపదతో పాడి రైతులు ఆర్థిక పురోభివృద్ధి చెందుతామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పసుపల్లిలో ఏపీఓ ఏవీ కృష్ణారావు అధ్యక్షతన మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు పశువులకు రూ.2.30 లక్షలతో వక్కపట్ల శ్రీనివాసరావు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలతో నాగులపల్లి కొండలరావులు గోకులం షెడ్లను నిర్మించారన్నారు. అర్హులైన ప్రతి పాడి రైతు మినీ గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీఓ జి.సరోవర్, కుడుపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పసుపల్లిలో గోకులం షెడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



సఖినేటిపల్లిలంక పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు



మామిడికుదురులో భోగి మంట వద్ద సంప్రదాయ వేషధారణతో విద్యార్థులు

మామిడికుదురు: సంప్రదాయ వేషధారణలు, పిండి వంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, రెండెడ్ల బండి విన్యాసాలు, సంక్రాంతికి తలమానికంగా నిలిచే ప్రభలు, సంప్రదాయ వస్త్రాలు, భోగి మంటలు తదితర అంశాలతో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు పాఠశాలలో శుక్రవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. విద్యార్థులు కోలాటం, ఆడుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆద్యంతం కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీవీవీ సత్యనారాయణ, యక్కలదేవర వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పతంగులు ఎగురవేస్తూ కేరింతలతో సంతోషం గడిపారు. హరిదాసు వేషధారణ, గంగిరెద్దును సిద్ధం చేసి సంబరాలు చేశారు. విద్యార్థినులు రంగవల్లులతో పాఠశాల ప్రాంగణం తీర్చిదిద్దారు. వీటితో పాటు ప్రాంగణంలో భోగి మంటను వేసి సంక్రాంతి శోభను తెచ్చారు. ఏపీ స్టేట్ ఎన్జీటీ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి, హెచ్ఎం జి.మల్లికార్జునరావు, బోధన సిబ్బంది, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 అమలు



డీఎస్పీ గోవిందరావు

కొత్తపేట: స్థానిక సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 31 వరకూ పోలీసు చట్టం సెక్షన్ 30 అమలులో ఉందని డీఎస్పీ వై.గోవిందరావు తెలిపారు. ఆమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, సఖినేటిపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు బహిరంగ సభలు, సమావేశాలు పాదయాత్రలు, ఊరేగింపులకు అనుమతి లేదని పేర్కొన్నారు. కొత్తపేట సబ్ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో వివిధ డిమాండ్లపై వివిధ పార్టీల మతపరమైన ఊరేగింపులు, సభలు, వ్యక్తుల ఆందోళనల దృష్ట్యా సెక్షన్ 30 ఆఫ్ ఇండియన్ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

మామిడికుదురు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మొగలికుదురులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. వేద పండితులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు స్వామి వారికి లక్ష తులసి పూజను వైభవంగా జరిపించారు. ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి వ్రతాలు ఆచరించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జయంతి



రావులపాలెంలో సోమసుందరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న తనయుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం గోపాలపురంలోని కాలువ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే గ్రామపెద్దలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు కూడా నివాళులు అర్పించారు. అనంతరం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జాతీయ రహదారి చెంతన ఉన్న సోమసుందరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో పాటు కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీలు కుడుపూడి శ్రీనివాసరావు, బోణం సాయిబాబు, మాజీ జెడ్పీటీసీలు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచులు తమ్మన శ్రీను, దొమ్మేటి అర్జునరావు, రెడ్డి చంటి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అడిగిన వారందరికీ పని కల్పించాలి

కొత్తపేట: ఉపాధి హామీ పథకం కింద పని అడిగిన అందరికీ వంద రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అధికారులకు సూచించారు. మండల స్థాయి ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని కృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద చేపట్టే పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ రూ.9,84,52,671 వ్యయంతో 418 పనులు చేపట్టినట్టు ఏపీఓ ఎన్.ఆనంద్ వివరించారు. మెటీరియల్‌కు సుమారు రూ.2.37 కోట్లు, వేతనాలకు సుమారు రూ.7.46 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. ఆయా పనులపై పీడీ ఎస్.మధుసూదన్ సమీక్షించారు. పలు పనుల్లో రూ.1.81 లక్షలు తేడాలను గుర్తించారు. ఎఫ్ఏలు, ఇతర సిబ్బంది నుంచి రికవరి చేయాలని సూచించారు. మస్టర్లలో పలు తేడాలను గుర్తించారు. గోకులాల పనుల పూర్తికి 15 రోజులు గడువిచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు, ఎస్ఆర్‌పీ కనకరాజు, అంబుడ్స్‌మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.